SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 848 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | బుధవారం 08-07-2026

## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం.. స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు

- ఇండోనేషియాకు చేరిన ప్రధాని మోదీ
- స్వయంగా వచ్చి ఆహ్వానించిన అధ్యక్షుడు ప్రబోవో
- యుద్ధ విమానాలతో మోదీ విమానానికి ఎస్కార్ట్
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు
- ప్రంబనన్ ఆలయ సముదాయం సందర్శించనున్న మోదీ
- రక్షణ, వాణిజ్య సహకార విస్తరణపై దృష్టి




ఢిల్లీ: మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేషియా రాజధాని జకార్తాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన కోసం అక్కడి చేరుకున్న ఆయనకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం విశేషం. ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ప్రతీకగా ఈ ప్రత్యేక ఆతిథ్యాన్ని భావిస్తున్నారు. భారత ప్రధాని ప్రయాణిస్తున్న ప్రత్యేక

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ..
## సీఎం రేవంత్ కీలక ఆదేశాలు




పర్యాటక రంగంపై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష
తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం

## నా రక్తంలోనే కాషాయం ఉంది: పేర్ని నాని విమర్శలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కౌంటర్!




చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకునే వ్యక్తి పేర్ని నాని అని సత్యకుమార్ ఎద్దేవా
తాను పదవుల కోసం ఆశపడే వ్యక్తి కాదని వ్యాఖ్య
జగన్ ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమన్న మంత్రి

## నా బిడ్డ మరణాన్ని వాడుకున్నారు
### పవన్ కల్యాణ్ పై పోలీసులకు సుగాలి ప్రీతి తల్లి ఫిర్యాదు




- పవన్ కల్యాణ్‌పై గన్నవరం పోలీస్ స్టేషన్‌లో పార్వతీ దేవి ఫిర్యాదు
- తమకు నమ్మక ద్రోహం చేశారన్న పార్వతీ దేవి
- న్యాయం అడిగితే జనసేన కార్యకర్తలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపణ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సుగాలి ప్రీతి తల్లి పార్వతీ దేవి గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. తన కుమార్తె మరణాన్ని పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుని, తమకు నమ్మక ద్రోహం చేశారని ఆమె ఆరోపించారు. పవన్‌పై చీటింగ్, నమ్మకద్రోహం, నిందితులతో కుమ్మక్కవడం వంటి అంశాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు: అంబటి రాంబాబు




- కక్ష సాధింపులకు పోలీసులను ప్రభుత్వం వాడుకుంటోందన్న అంబటి
- సాధారణ యూట్యూబర్ రావణ్‌పై దేశద్రోహం చట్టాలను ప్రయోగించారని మండిపాటు
- రావణ్‌కు న్యాయ సహాయం అందిస్తామని వెల్లడి

## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు: రాంచందర్ రావు

- కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతున్నాయన్న రాంచందర్ రావు
- జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టలేదని విమర్శ
- హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని మండిపాటు




హైదరాబాద్: జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

# ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు...
## - సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- ప్రజా సమస్యలపై రియల్ టైమ్‌లో స్పందించాలని అధికారులకు సీఎం ఆదేశం
- పీజీఆర్ఎస్ కింద పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- పట్టణ ప్రాంతాల్లో జీరో వేస్ట్ లక్ష్యంగా మూడు నెలల్లో చెత్త తొలగింపు
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలి, మహిళల భద్రతకు పెద్దపీట
- మారుమూల గ్రామాల్లో కమ్యూనికేషన్ టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ




అమరావతి: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై రియల్ టైమ్‌లోనే స్పందన ఉండాలని, ప్రభుత్వ సేవల్లో వేగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన ముగించుకుని అమరావతికి చేరుకున్న ఆయన, సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీ) కేంద్రంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ వంటి కీలక శాఖల పనితీరు, ప్రజా సేవల్లో నాణ్యతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

# క్యూర్ బిల్లుతో సమగ్ర పట్టణ పాలనకు కొత్త వ్యవస్థ
## మహా నగరానికి నయా దిశ

- మెట్రోపాలిటన్ స్థాయిలో సమన్వయం
- కార్పొరేషన్లలో వికేంద్రీకృత పాలన
- జీహెచ్ఎంసీలోని ప్రధాన అంశాలు కొనసాగింపు
- కొత్తగా పాలక మండళ్లలో ట్రాన్స్‌జెండర్‌కు స్థానం
- క్యాపిటల్ వాల్యూతో భారీగా పెరగనున్న ఆస్తిపన్ను





హైదరాబాద్: జీహెచ్ఎంసీ యాక్ట్--1955 స్థానే టీ క్యూర్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు--2026 ద్వారా వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగర అవసరాలకు అనుగుణంగా ఆధునిక, సమగ్ర, సాంకేతిక ఆధారిత పాలనను అందించడం లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. దాదాపు 15 లక్షల జనాభాను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన 1955 చట్టం, ఇప్పుడు 1.3 కోట్ల జనాభా కలిగిన మెట్రోపాలిటన్ ప్రాంతానికి సరిపోవడం లేదని పేర్కొంది. అందుకే నగర పాలనను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే ఉద్దేశంతో కొత్త చట్టాన్ని తెస్తున్నట్లు వెల్లడించింది. 'క్యూర్' పరిధిలో జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లలో సమగ్ర పాలన అమలు చేయనున్నారు. మెట్రోపాలిటన్ స్థాయిలో సమన్వయం కొనసాగుతూనే,

## ప్రపంచంలోనే అత్యంత అందమైన ఎయిర్‌పోర్టులు... జాబితాలో రెండు భారత విమానాశ్రయాలు




ప్రపంచంలోని అత్యంత అందమైన ఎయిర్‌పోర్టుల జాబితా విడుదల
ప్రిక్స్ వెర్సైల్స్ 2026 జాబితాలో రెండు భారత విమానాశ్రయాలు
గౌహతి, నవీ ముంబై ఎయిర్‌పోర్టులకు దక్కిన అరుదైన గౌరవం

## మెలోనీపై ట్రంప్ విచిత్రమైన మీమ్.. ఆమె నుంచి రక్షణ కావాలంటూ పోస్ట్!




ఇటలీ ప్రధాని మెలోనీని టార్గెట్ చేస్తూ ట్రంప్ మీమ్ పోస్ట్
ఆమె నుంచి తనకు 'రెస్ట్రెయినింగ్ ఆర్డర్' కావాలంటూ సంచలన వ్యాఖ్య
జీ7 సదస్సులో ఫొటో కోసం మెలోనీ బతిమాలారని ట్రంప్ ఆరోపణ

## మూడో టీ20లో బౌలింగ్‌లో మార్పులకు సిద్ధం.. టీమిండియాలో అదనపు పేసర్‌కు అవకాశం!




ఢిల్లీ: వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న భారత జట్టు.. ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగే మూడో టీ20లో తప్పక గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా రాత్రి 10 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. రెండో మ్యాచ్‌లో ఓటమిపాలై సిరీస్ లో వెనుకబడిన భారత్‌కు ఈ మ్యాచ్ 'డూ ఆర్ డై'గా మారింది.

సీమకిరణం
నంద్యాల కర్నూలు
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



## ప్రపంచంలోనే అత్యంత అందమైన ఎయిర్‌పోర్టులు... జాబితాలో రెండు భారత విమానాశ్రయాలు

ఢిల్లీ: భారత విమానయాన రంగం అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటింది. దేశంలోని రెండు విమానాశ్రయాలు ప్రపంచంలోనే అత్యంత అందమైన ఎయిర్‌పోర్టుల జాబితాలో స్థానం సంపాదించుకున్నాయి. గౌహతిలోని లోక్‌ప్రియ గోపీనాథ్ బొర్దొలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం (టెర్మినల్-2), నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం (టెర్మినల్-1) ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నాయి. ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్, డిజైన్ అవార్డు అయిన 'ప్రిక్స్ వెర్సైల్స్ 2026' తాజాగా ఈ జాబితాను విడుదల చేసింది. పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ప్రకటించిన ఈ పురస్కారం, ప్రపంచవ్యాప్తంగా కొత్తగా నిర్మించిన లేదా ఆధునీకరించిన విమానాశ్రయాలను గుర్తిస్తుంది. ఆధునిక డిజైన్, పర్యావరణ హిత నిర్మాణం, సాంస్కృతిక గుర్తింపు, ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందించే అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ ఎంపిక చేపడతారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఏడు విమానాశ్రయాలు ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో చోటు దక్కించుకున్నాయి. గౌహతిలోని టెర్మినల్-2ను ఈశాన్య భారతానికి ప్రత్యేకమైన 'వెదురు ఆర్కిడ్' స్ఫూర్తిగా నిర్మించారు. టెర్మినల్ లోపల 'ఇండోర్ స్కై ఫారెస్ట్', అస్సామీ సంప్రదాయ హస్తకళ మేళవింపుతో దీనికి రూపకల్పన చేశారు. ఇక, అదానీ గ్రూప్ ఆధ్వర్యంలోని నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-1ను 'కమలం' ఆకృతిలో నిర్మించారు. సహజ సిద్ధమైన వెలుతురు, గాలి ప్రసరణకు పెద్దపీట వేస్తూ, ఇంధన వినియోగాన్ని తగ్గించేలా దీన్ని అద్భుతంగా డిజైన్ చేశారు. ఈ జాబితాలో భారత్‌తో పాటు చైనాలోని గ్వాంగ్జౌ, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్, అమెరికాలోని పిట్స్‌బర్గ్, శాన్ డియాగో విమానాశ్రయాలు కూడా ఉన్నాయి. విమానాశ్రయాలు కేవలం రవాణా కేంద్రాలుగానే కాకుండా, అద్భుతమైన సాంస్కృతిక చిహ్నాలుగా తీర్చిదిద్దడంలో భారత్ అగ్రగామిగా నిలుస్తోందని ఈ అంతర్జాతీయ గుర్తింపు చాటిచెబుతోంది.

## మెలోనీపై ట్రంప్ విచిత్రమైన మీమ్.. ఆమె నుంచి రక్షణ కావాలంటూ పోస్ట్!

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మధ్య మాటల యుద్ధం మరింత తీవ్ర స్థాయికి చేరింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్న సంకేతాల నడుమ, ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో మెలోనీని ఉద్దేశించి ఒక విచిత్రమైన మీమ్ పోస్ట్ చేయడం సంచలనం సృష్టిస్తోంది. మెలోనీ తనపై అభిమానంతో ఉన్నట్లుగా చిత్రీకరించిన ఒక ఎడిటెడ్ ఫొటోను షేర్ చేసిన ట్రంప్.. "ఆమె నుంచి నాకు రెస్ట్రెయినింగ్ ఆర్డర్ కావాలి" అంటూ వ్యాఖ్యానించారు. ఈ పరిణామం ఇద్దరు నేతల మధ్య విభేదాలను బహిర్గతం చేసింది. టర్కీలో నాటో దేశాధినేతల సదస్సు జరగనున్న నేపథ్యంలో ఈ పోస్ట్ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సదస్సులో ట్రంప్, మెలోనీ ముఖాముఖి భేటీ అయ్యే అవకాశం ఉంది. ట్రంప్ ఆదివారం చేసిన పోస్టుల్లో ఇది ఒకటి. ఇదే క్రమంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన భార్య మిషెల్ ఒబామా నకిలీ చిత్రాన్ని కూడా ఆయన పంచుకున్నారు.

వివాదానికి దారి తీసిన జీ7 సదస్సు

గత వారం జరిగిన జీ7 సదస్సులో ఈ ఇద్దరు నేతల మధ్య వివాదం మొదలైంది. తనతో ఒక ఫొటో దిగేందుకు మెలోనీ పదేపదే అడిగారని, దాదాపు బతిమాలినట్లుగా ప్రవర్తించారని ట్రంప్ ఆరోపించారు. అంతేకాకుండా ఇంధనం, వలసల విషయంలో ఐరోపా దేశాలు పూర్తిగా తప్పుడు విధానాలు అవలంబిస్తున్నాయని, ఈ సమస్యలను పరిష్కరించకపోతే ఐరోపా భవిష్యత్తు అంధకారమవుతుందని ఆయన విమర్శించారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇటలీ తీవ్రంగా స్పందించింది. ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీ, నిరసనగా తన వాషింగ్టన్ పర్యటనను రద్దు చేసుకున్నారు. ట్రంప్ ఆరోపణలను జార్జియా మెలోనీ తీవ్రంగా ఖండించారు. "అవి పూర్తిగా కల్పితమైన ఆరోపణలు. ఇటలీ, నేను ఎప్పుడూ, ఎవరినీ బతిమాలం" అని ఆమె స్పష్టం చేశారు. "నేను అమెరికాకు వ్యతిరేకిని కాదు. పశ్చిమ దేశాలన్నీ ఐక్యంగా ఉంటేనే బలంగా ఉంటాయని నమ్మే వ్యక్తిని. అయితే, బలమైన సంబంధాలు నిక్కచ్చిగా మాట్లాడటంపై ఆధారపడి ఉంటాయి. నేను నిక్కచ్చైన వ్యక్తిని" అని మెలోనీ ఇటాలియన్ న్యూస్ ఏజెన్సీ అడ్న్‌క్రోనోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ వ్యక్తిగత ఆరోపణల వెనుక ఇతర భౌగోళిక రాజకీయ కారణాలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేపడుతున్న చర్యలకు మద్దతిచ్చే విషయంలో ఇటలీ విముఖత చూపడం కూడా ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడానికి ఒక కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జరగబోయే నాటో సదస్సులో ట్రంప్, మెలోనీల సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## మూడో టీ20లో బౌలింగ్‌లో మార్పులకు సిద్ధం.. టీమిండియాలో అదనపు పేసర్‌కు అవకాశం!


మొదటి పేజి తరువాయి

రెండో మ్యాచ్‌లో ఓటమిపాలై సిరీస్ లో వెనుకబడిన భారత్‌కు ఈ మ్యాచ్ 'డూ ఆర్ డై'గా మారింది. మరోవైపు ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్ ఈ మ్యాచ్ గెలిచి మరింత ఆధిక్యంలోకి వెళ్లాలని చూస్తోంది. ఈ ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో తొలి మ్యాచ్ వర్షం వల్ల ఫలితం తేలకుండానే రద్దయింది. రెండో మ్యాచ్ లో ఇంగ్లండ్ గెలిచింది. దాంతో నేటి మ్యాచ్ టీమిండియాకు కీలకంగా మారింది. రెండో మ్యాచ్‌లో భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ నిరాశపరిచింది. ముఖ్యంగా బౌలింగ్ విభాగం తీవ్రంగా విఫలమైంది. రెండో టీ20లో స్పిన్నర్ రవి బిష్ణోయ్ నాలుగు ఓవర్లలో 60 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతేకాదు, ఒకే ఓవర్లో మూడు బ్యాక్‌ఫుట్ నోబాల్స్ వేయడంతో జట్టు భారీ మూల్యం చెల్లించుకుంది. దీంతో మూడో మ్యాచ్‌లో బౌలింగ్ కూర్పులో మార్పులు చేయాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. బిష్ణోయ్ స్థానంలో యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రసిద్ధ్ కృష్ణ కంటే ప్రిన్స్ యాదవ్‌కే జట్టు మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. బ్యాటింగ్‌లోనూ భారత జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రమే 59, 43 పరుగులతో నిలకడగా ఆడుతున్నాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ కొంతమేర పరుగులు చేసినా మ్యాచ్‌ను మలిచే ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన తొలి అంతర్జాతీయ సిరీస్‌లో గుర్తుండిపోయే ప్రదర్శన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. సిరీస్‌లో నిలవాలంటే బ్యాటింగ్‌లో దూకుడు, బౌలింగ్‌లో కచ్చితత్వం తప్పనిసరి అని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో వికెట్లు తీయడం, డెత్ ఓవర్లలో పరుగులను నియంత్రించడం భారత్‌కు కీలకంగా మారింది.

## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు: రాంచందర్ రావు

హైదరాబాద్: జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తదితర నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు మరువలేనివని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ అవినీతిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మరోవైపు హైడ్రా కూల్చివేతల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని... ఎంఐఎం నేతలకు చెందిన ఫాతిమా విద్యాసంస్థల అక్రమ కట్టడాలపై కోర్టులు తప్పుబట్టినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్-ఎంఐఎం దోస్తీ వల్లే ఈ పక్షపాతమని... హైడ్రా అందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని, లేనిపక్షంలో విపక్షాల అక్రమాలపై రాష్ట్రవ్యాప్త పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం.. స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు



మొదటి పేజి తరువాయి

భారత ప్రధాని ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్ చేశాయి. జకార్తా విమానాశ్రయంలో సంప్రదాయ ఇండోనేషియా నృత్య ప్రదర్శనలతో మోదీకి ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ పర్యటనలో మోదీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్-ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించనున్నారు. పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో 2018లో భారత్-ఇండోనేషియా సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేశామని మోదీ గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యం తర్వాత తన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదేనని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రబోవో పర్యటనకు కొనసాగింపుగానే ఈ భేటీ జరుగుతోందని తెలిపారు. ఇండోనేషియాలోని భారతీయ ప్రవాసులతో మోదీ సమావేశం కానున్నారు. అలాగే ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఈ ఆలయం భారత్-ఇండోనేషియా సాంస్కృతిక బంధానికి ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారం మరింత బలపడింది. బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, సైనిక శిక్షణ, రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం విస్తరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-ఇండోనేషియా ద్వైపాక్షిక వాణిజ్యం 24.78 బిలియన్ డాలర్లకు చేరగా, 130కి పైగా భారత కంపెనీలు ఇండోనేషియాలో పెట్టుబడులు పెట్టాయి. ఇండోనేషియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్నారు.

# క్యూర్ బిల్లుతో సమగ్ర పట్టణ పాలనకు కొత్త వ్యవస్థ

మొదటి పేజి తరువాయి

మెట్రోపాలిటన్ స్థాయిలో సమన్వయం కొనసాగుతూనే, కార్పొరేషన్ స్థాయిలో వికేంద్రీకృత పాలన కొనసాగుతుందని ప్రభుత్వం తెలిపింది.

కీలక నిబంధనల కొనసాగింపు..

ప్రస్తుతం అమల్లో ఉన్న జీహెచ్ఎంసీ చట్టంలోని పలు కీలక నిబంధనలను కొత్త బిల్లులో కొనసాగించారు. వాటిలో.. కార్పొరేషన్ల నిర్మాణం, స్టాండింగ్ కమిటీలు, కమిషనర్ల అధికారాలు, వార్డు కమిటీలు, ఎన్నికల విధానం, ఆస్తి పన్ను పరిపాలన, రుణాల సేకరణ అధికారాలు, జంతు నియంత్రణ వంటి అంశాలు యథాతథంగా కొనసాగనున్నాయి. అదే విధంగా మున్సిపల్ సంస్థల్లో ట్రాన్స్‌జెండర్ సభ్యుడికి ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, కాలం చెల్లిన ఎన్నికల అనర్హత నిబంధనలను తొలగించనున్నారు.

ఆస్తి పన్ను విధానంలో భారీ మార్పులు

ఆస్తి పన్ను వ్యవస్థలో కీలక సంస్కరణలు ప్రతిపాదించారు. వార్షిక అద్దె విలువ(యాన్యువల్ రెంటల్ వాల్యూ) స్థానంలో మూలధన విలువ (క్యాపిటల్ వాల్యూ) ఆధారంగా పన్ను విధింపు ఉంటుంది. తద్వారా ఆస్తిపన్ను భారీగా పెరగనుంది. ఆక్ట్రాయ్, శునకాల పన్ను వంటివి రద్దు కానున్నాయి. అలాగే పలు సంస్కరణలు చేయనున్నారు. ప్రతి ఆస్తికి ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ ప్రాపర్టీ ఐడెంటిటీ



కోడ్ కేటాయింపు. సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానం ప్రవేశపెట్టడం. సకాలంలో పన్నులు చెల్లించే వారికి రాయితీలు. పర్యావరణహిత చర్యలు చేపట్టే ఆస్తి యజమానులకు ప్రోత్సాహకాలు. వ్యాపారాలు, మౌలిక సదుపాయాలకు ఊతం. వ్యాపార అనుమతులను మరింత సులభతరం చేసేలా పలు సంస్కరణలు ప్రతిపాదించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యంఇచ్చారు.

ప్రజారోగ్యం, పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి

ప్రజారోగ్యానికి సంబంధించి అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యేక అధికారాలు కల్పించడం, ప్రజా ఇబ్బందుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, పారిశుద్ధ్యాన్ని మాన్యువల్ స్కావెంజర్స్ చట్టానికి అనుగుణంగా అమలు చేయడం వంటివి ఉన్నాయి. తాగునీరు-- మురుగునీటి నియంత్రణ బాధ్యతలను హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు అప్పగించే ప్రతిపాదనలు బిల్లులో ఉన్నాయి.

కొత్త సంస్థలకు రూపకల్పన

సమగ్ర పట్టణ పాలన కోసం పలు కొత్త సంస్థలను ఏర్పాటు చేయాలని బిల్లు ప్రతిపాదించింది. ఇందులో ముఖ్యమంత్రి అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల రక్షణకు హైడ్రాకు స్పెషల్ పవర్స్. విపత్తు నిర్వహణ సంస్థ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అథారిటీ. క్లైమేట్ యాక్షన్, వారసత్వ కట్టడాల సంరక్షణ, ఆహార భద్రత, జెండర్ ఇన్‌క్లూజన్, కార్మిక సంక్షేమ సంస్థల వంటివి ఉన్నాయి. అలాగే.. సాంకేతిక ఆధారిత సేవల కోసం రియల్‌టైమ్ పర్యవేక్షణకు 'క్యూర్ స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్' ఏర్పాటు. అత్యవసర సమయాల్లో సమన్వయం కోసం అన్ని శాఖల సేవలను ఒకే వేదికపై అందించే సమగ్ర డిజిటల్ పోర్టల్ ఏర్పాటు. విద్యుత్, నీరు తదితర సేవలకు ఒకే కన్సాలిడేటెడ్ యుటిలిటీ బిల్లు. ఫిర్యాదుల త్వరిత పరిష్కారం కోసం'క్యూర్ అప్పిలేట్ అథారిటీ' ఏర్పాటు. ఈ బిల్లు అమల్లోకి వస్తే హైదరాబాద్ మహానగర పాలనలో సమూల మార్పులు చోటుచేసుకోవడంతో పాటు, పరిపాలన మరింత కేంద్రీకృతం, సాంకేతిక ఆధారితం, సమన్వయపూర్వకంగా మారే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు... - సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

మొదటి పేజి తరువాయి

పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ వంటి కీలక శాఖల పనితీరు, ప్రజా సేవల్లో నాణ్యతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవలు అందించగలమని, పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన అన్నారు. రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి ప్రజలకు వాస్తవ సమయంలోనే స్పందన అందాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సముద్ర తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనను ఉదాహరణగా చూపుతూ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వివిధ ప్రభుత్వ విభాగాలు ఎంత తక్షణమే సమన్వయంతో స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం మధ్య సమన్వయం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఆధ్వర్యంలో తరచూ మల్టీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేషన్ సమావేశాలు జరగాలని సూచించారు. ఆర్టీజీ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. "ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో 'లాస్ట్ మైల్ గవర్నెన్స్' ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్, బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి," అని ముఖ్యమంత్రి విశ్లేషించారు.

పీజీఆర్ఎస్ పరిష్కారానికి యాక్షన్ ప్లాన్

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద పెండింగ్‌లో





ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

పట్టణాల్లో 'జీరో వేస్ట్' లక్ష్యం

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకుపోయిన 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రాబోయే మూడు నెలల్లోగా యుద్ధప్రాతిపదికన తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 'జీరో వేస్ట్' సాధించడమే మన లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బృహత్కార్యంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై శ్రద్ధ పెట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ వంటి కార్యక్రమాలపై నిర్దిష్ట ప్రామాణిక కార్యాచరణ విధానం జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

గంజాయిపై ఉక్కుపాదం.. భద్రతకు పెద్దపీట

రాష్ట్రంలో గంజాయి మూలాలను పూర్తిగా నియంత్రించాలని, వాటిపై ఉక్కుపాదం మోపాలని హోం శాఖ అధికారులకు సీఎం నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం 'డ్రగ్ ఫ్రీ కంట్రీ' లక్ష్యంతో పనిచేస్తోందని, దానికి అనుగుణంగా రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యల సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలని, పాలనలో పొదుపు మంత్రాన్ని పాటించాలని అధికారులకు హితవు పలికారు. మారుమూల ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం టవర్లను ఏర్పాటు చేసేందుకు టెలికాం ఆపరేటర్లతో మాట్లాడి కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నా బిడ్డ మరణాన్ని వాడుకున్నారు

మొదటి పేజి తరువాయి

పవన్‌పై చీటింగ్, నమ్మకద్రోహం, నిందితులతో కుమ్మక్కవడం వంటి అంశాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే తొలి సంతకం సుగాలి ప్రీతి కేసు విచారణ ఫైలుపైనే చేస్తానన్న పవన్, ఇప్పుడు మాట మార్చారని పార్వతీ దేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలు, డీఎన్ఏ లేవంటూ నిందితులకు క్లీన్ చిట్ ఇచ్చేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. న్యాయం అడిగితే జనసేన కార్యకర్తలను ఉసిగొల్పి తనపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. 2017లో కర్నూలులోని ఓ ప్రైవేట్ స్కూల్లో సుగాలి ప్రీతి అనుమానాస్పద స్థితిలో మరణించగా, కరెస్పాండెంట్ కుమారులు ఆమెపై అత్యాచారం చేసి చంపేశారని తల్లిదండ్రులు పోరాడుతున్నారు. గతంలో పవన్ కల్యాణ్ వీరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ తనకు న్యాయం జరగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన పార్వతీ దేవి.. డిప్యూటీ సీఎంపైనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించారు.ద

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్: తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తారామతి బారాదరిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లను ఆధునికీకరించాలని చెప్పారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, అక్కడి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి యాదాద్రి తరహాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణహిత పర్యాటకానికి ప్రాధాన్యమిస్తూ 'క్యూర్' పరిధిలోని అటవీ భూములను 'ఎకో టూరిజం' కింద అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ వంతెనను ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. అవసరమైతే అక్కడి ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని అధికారులకు తెలిపారు.

## నా రక్తంలోనే కాషాయం ఉంది పేర్ని నాని విమర్శలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కౌంటర్!

అమరావతి: వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన.. పేర్ని నానిని 'చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకునే వ్యక్తి'గా అభివర్ణించారు. తాను రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారే అవకాశవాదిని కాదని, తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే వ్యక్తినని స్పష్టం చేశారు. "నేను పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదు. నా రక్తంలోనే కాషాయం, బీజేపీ సిద్ధాంతం ఉన్నాయి. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఒక మంత్రిగా... ప్రభుత్వంపై చేసే అర్థరహితమైన విమర్శలను చూస్తూ ఊరుకోను" అని సత్యకుమార్ హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ ను తాను వ్యక్తిగతంగా ఎప్పుడూ దూషించలేదని... ఆయన అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమని చెప్పారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అని, రాజధాని విషయంలో ఆయన మాట్లాడుతున్న తీరు చూస్తుంటే కనీస అవగాహన లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం చేసి, అతి త్వరలోనే పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యాయని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి చిన్న సమస్య, ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ు

## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు: పొన్నం ప్రభాకర్


హైదరాబాద్: అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో కోట్ల రూపాయల భారీ అవినీతి జరిగిందంటూ తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ ఎదుగుదల కోసం దేవుడిని వాడుకోవడంలో బీజేపీ పరాకాష్ఠకు చేరిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా రామయ్య గుడి కోసం విరాళాలు ఇస్తే, కమలం పార్టీ నేతలు ఆ సొమ్మును కూడా వదలకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. "బీజేపీ నాయకులు శ్రీరాముడి పేరును, అక్షింతలను అడ్డం పెట్టుకుని ఇళ్ల వెంట తిరిగి విరాళాలు వసూలు చేశారు. తీరా చూస్తే ఆ నిధుల్లోనే కోట్లాది రూపాయల అవినీతికి తెరలేపారు. దేవుడి హుండీలోని సొమ్మును సైతం లూటీ చేయడం దేశ ప్రజలందరినీ అవమానించడమే" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల అసలు రంగును, వారి అవినీతి అక్రమాలను అక్కడి స్థానిక ప్రజలు ముందే గుర్తించారని... అందుకే అయోధ్య పరిధిలోని లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిని అక్కడి ఓటర్లు ఓడించి బుద్ధి చెప్పారని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. భక్తి వేరు, రాజకీయం వేరని స్పష్టం చేసిన మంత్రి... ఈ విరాళాల కుంభకోణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లదే పూర్తి బాధ్యతని అన్నారు. దేవుడి పేరుతో సాగించిన ఈ పెద్ద స్కాంపై బీజేపీ తక్షణమే స్పందించాలని, దేశ ప్రజలందరికీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో రాజకీయ వ్యాపారం చేసే శక్తులను ప్రజలు ఇకనైనా గుర్తించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## భారీ వర్షాల్లో ప్రయాణం.. ఈ జాగ్రత్తలు ప్రాణాలు కాపాడతాయి!



హైదరాబాద్: భారీ వర్షాల సమయంలో ప్రయాణాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుంది. రోడ్లపై నీరు నిలవడం, ట్రాఫిక్ జామ్‌లు, రైళ్ల ఆలస్యం, సరిగా కనిపించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. బైక్, కారు, బస్సు లేదా రైలులో ప్రయాణించే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు. ఇండియా టుడే కథనం ప్రకారం... ప్రయాణానికి ముందు వాతావరణ సూచనలు, ట్రాఫిక్ పరిస్థితిని తప్పనిసరిగా తెలుసుకోవాలి. భారీ వర్షం, వరదలు, కొండచరియలు విరిగిపడే హెచ్చరికలు ఉంటే ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది. కారు నడిపేవారు వేగాన్ని తగ్గించి, ముందు వాహనంతో తగినంత దూరం పాటించాలి. వర్షంలో పగటిపూట హెడ్‌లైట్లు ఆన్ చేయొద్దు. ఆకస్మికంగా బ్రేకులు వేయడం లేదా వేగంగా మలుపులు తిప్పడం నివారించాలి. నీటితో నిండిన రోడ్లలో వాహనాన్ని నడపొద్దు. అలాంటి ప్రాంతాల్లో గుంతలు, తెరిచి ఉన్న డ్రైన్లు లేదా దెబ్బతిన్న రోడ్లు ఉండే ప్రమాదం ఉంది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవడం మంచిది. రైలులో ప్రయాణించే వారు ముందుగానే రైలు సమయాన్ని పరిశీలించాలి. ప్లాట్‌ఫారంపై భద్రతా గీత వెనుక నిలబడాలి. రైలు ఆలస్యమైనా పట్టాలు దాటే ప్రయత్నం చేయకూడదు. రైల్వే అధికారులు చేసే ప్రకటనలను గమనిస్తూ ఉండాలి. ప్రయాణంలో పూర్తిగా ఛార్జ్ చేసిన మొబైల్ ఫోన్, పవర్ బ్యాంక్, తాగునీరు, తేలికపాటి ఆహారం, అవసరమైన మందులు, గొడుగు లేదా రెయిన్‌కోట్ వెంట తీసుకెళ్లాలి. ముఖ్యమైన పత్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను వాటర్‌ప్రూఫ్ కవర్లలో ఉంచాలి. జారని చెప్పులు లేదా షూ ధరించడం మంచిది. నిలిచిపోయిన నీటిలో నడవకుండా ఉండాలి. అక్కడ గుంతలు లేదా తెరిచి ఉన్న డ్రైన్లు ఉండే అవకాశం ఉంది. పడిపోయిన చెట్లు, విద్యుత్ తీగలు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలి. వర్షం కారణంగా సరిగా కనిపించకపోతే సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని ఆపి పరిస్థితులు మెరుగుపడిన తర్వాతే ప్రయాణం కొనసాగించాలి.

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు: అంబటి రాంబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటూ ప్రతిపక్షాలే లక్ష్యంగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ నేతలతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్టులు, రాజకీయ విశ్లేషకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే అక్రమ కేసులు, అరెస్టుల పర్వానికి తెరలేపారని ఆయన మండిపడ్డారు. వివాదాస్పద యూట్యూబర్ రావణ్ (జోసెఫ్), కేవీఆర్ వంటి వారికి తమ వైసీపీతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవని అంబటి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఒక సాధారణ యూట్యూబర్‌పై దేశద్రోహం, 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమన్నారు. చట్ట పరిధి దాటి ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవచ్చు కానీ, దారుణమైన సెక్షన్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. రావణ్‌ను శారీరకంగా అంతమొందించే ప్రయత్నాలు కూడా జరిగాయని అంబటి సంచలన ఆరోపణ చేశారు. ఈ కేసులో పిఠాపురం కోర్టుతో పాటు పలు న్యాయస్థానాలు రావణ్‌కు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోవడం లేదన్నారు. రావణ్ తమ పార్టీ వ్యక్తి కాకపోయినప్పటికీ, బాధితుడిగా అతనికి వైసీపీ తరఫున అవసరమైన పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు. కేవీఆర్ అరెస్టు వ్యవహారంలో ఏపీ పోలీసులు కనీస చట్టపరమైన నిబంధనలు పాటించలేదని... అందుకే దౌర్జన్యంగా ప్రవర్తించిన ఏపీ పోలీసులపై ఏకంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సోషల్ మీడియాపై అధికారిక దౌర్జన్యకాండ సాగుతోందని అంబటి విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తులు అత్యంత అసభ్య పదజాలంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా... వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, చట్టం అందరికీ ఒకేలా ఎందుకు వర్తించడం లేదని నిలదీశారు.

# ఎన్యూమరేషన్ ఫాంలను బిఎల్వోలకు త్వరగా అందించండి

## ఓటర్లకు కర్నూలు ఈఆర్వో చల్లా ఓబులేసు విజ్ఞప్తి



కర్నూలు (సీమ కిరణం న్యూస్)జులై 7 : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంలను తీసుకున్న ఓటర్లు, వాటిని పూరించి, ఫోటో అతికించి వెంటనే బిఎల్వోలకు అందించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. మంగళవారం ఆయన చాకలి వీధి, కొత్తపేట రైతుబజార్ పరిసరాల్లోని 161, 163, 166 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా, అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలను 99% శాతం పంపిణి చేశామని, ఇతర ప్రాంతాల్లో ఉండటం కారణంగా ఏ ఓటరుకైనా ఎన్యూమరేషన్ ఫాం ఇప్పటి వరకు అందకపోతే, సమీప సచివాలయంలో ఎన్యూమరేషన్ ఫారం పొందాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫాం తీసుకున్నాక, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు అతికించి, ఆధార్ కార్డు జతచేసి, 2002వ సంవత్సరంలో ఓటరు లేదా ఓటరు పూర్వికుల ఓటు వివరాలు ఉన్నచో వాటి వివరాలతో పూరించి, బిఎల్వోకి అందించాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫాంపై బిఎల్వో పేరు, ఫోన్ నెంబర్ ఉంటుందని పేర్కొన్నారు.అదేవిధంగా భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ **https://voters.eci.gov.in/** ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూరించి సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లలో అవగాహన కల్పించేందుకు గత రెండు రోజులుగా మైక్ అనౌన్స్మెంట్ 10 ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సూపర్వైజర్ జి.ఎం. శ్రీకాంత్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాహిత పనులకు తోడ్పడాలి

## నగరాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు (సీమ కిరణం న్యూస్) జులై 7 : ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. మంగళవారం ఆయన ఏ.క్యాంపు, మారుతి మెగా సిటీ, వెంకటరమణ కాలనీ, జొహరపురం ప్రాంతాల్లో పారిశుద్ధ్య, మౌలిక వసతుల పనులను పరిశీలించారు.ఒమేగా ఆసుపత్రి ఎదురుగా ప్రజారోగ్యం, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన మురుగు నీటిని తొలగించే చర్యలను పరిశీలించారు. జొహరపురం రోడ్డులో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగు తున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఎడమ వైపున ఉన్న డ్రైన్‌తో అనుసంధానం చేసే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కొండారెడ్డి బురుజు పార్కు వద్ద డిజిటల్ స్క్రీన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సానుకూలంగా స్పందించి అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో నగరాభివృద్ధి పనులు మరింత వేగవంతంగా పూర్తై మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, ఏఈ రాంమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మోదీని చూసి నేర్చుకుంటేనే...

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని రాజకీయ పార్టీలు భావిస్తుంటాయి. అయితే, ప్రజలు మాత్రం ఎన్నికలు ఏవైనా రాజకీయ పార్టీలకు తమదైన రీతిలో సంకేతాలు, సందేశాలు పంపుతుంటారు. మన దేశంలో ప్రతి ఎన్నిక సందర్భంగా జరుగుతున్నది ఇదే! సోషల్ మీడియా ప్రవేశంతో అప్పుడప్పుడూ ప్రజలు విష ప్రచారం ప్రభావానికి గురవుతున్నప్పటికీ ఆ వెంటనే మేల్కొని రాజకీయ పార్టీలను ఎక్కడ పెట్టాలో అక్కడే పెడుతున్నారు. తాజాగా జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల్లో కూడా ప్రజలు తమదైన శైలిలో రాజకీయ పార్టీలకు సంకేతాలతో పాటు సందేశాలు, హెచ్చరికలూ పంపారు. అధికారంలో ఉన్నవారు మోసాలకు పాల్పడటం వల్ల గెలిచారని ఓడిపోయిన పార్టీలు గగ్గోలు పెడుతున్నాయి కానీ ప్రజల మనసులో ఏముందో అర్థం చేసుకొనే ప్రయత్నం చేయడంలేదు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికలే ఇందుకు ఉదాహరణ. అక్కడ అధికారంలో ఉన్నవారు ఓడిపోయారు. తరాలు మారుతున్నాయి. ప్రజల ఆలోచనలూ మారుతున్నాయని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ప్రతిపక్షాలు గుర్తించడం లేదు. పశ్చిమ బెంగాల్ ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలకు కంచుకోటగా ఉండింది. నాలుగు దశాబ్దాలపాటు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించాయి. ఇప్పుడు అవే కమ్యూనిస్టు పార్టీలు పశ్చిమ బెంగాల్లో సోదిలో లేకుండా పోయాయి. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన మమతా బెనర్జీ పదిహేనేళ్లపాటు పాలించి తాజా ఎన్నికల్లో ఓడిపోయారు. మూడు పర్యాయాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ పట్ల ముఖం మొత్తని ప్రజలు ఇతర రాజకీయ పార్టీల పట్ల వ్యతిరేకత ఎందుకు ఏర్పరచుకుంటున్నారు అన్న ప్రశ్నకు ప్రతిపక్షాలు, ముఖ్యంగా 'ఇండియా' కూటమి పార్టీలు సమాధానం అన్వేషించుకోవాలి. పొరుగున ఉన్న ఒడిశాలో ఐదు పర్యాయాలు అధికారంలో ఉండిన బిజూ జనతాదళ్‌ను మట్టి కరిపించి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడే మమతా బెనర్జీ మేల్కొని ఉండాల్సింది. అలా చేయకుండా అధికారంలో ఉన్నప్పుడు లెక్కలేనితనంతో వ్యవహరించడంతోపాటు రాజకీయ ప్రత్యర్థి బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకోకుండా ఓటమిని కొనితెచ్చుకున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల నేతృత్వంలో బీజేపీ వరుస విజయాలు ఎలా సాధించగలుగుతోంది? ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కానీ, ఆ పార్టీతో జతకట్టే ఇతర పార్టీలుగానీ ఎన్నికల్లో పరాజయాలను ఎందుకు మూటగట్టుకుంటున్నాయి? అన్న ప్రశ్నలకు సమాధానం తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. మోదీ--షా ద్వయం దేశంలో మరో రాజకీయ పార్టీని బతకనివ్వరా! వ్యవస్థలను చెరబట్టి అధికారంలో కొనసాగుతారా? అని ఆక్రోశం వెళ్లగక్కుతున్న పార్టీలు అలా ఎందుకు జరుగుతోందో తెలుసుకొనే ప్రయత్నం చేయడం లేదు. పశ్చిమ బెంగాల్లో కమ్యూనిస్టుల పాలన సాగినప్పుడు భయానక వాతావరణం ఉండింది. ఎదిరించిన ఎందరో హత్యలకు గురయ్యారు. శాంతిభద్రతలు అడుగంటాయి. అభివృద్ధి మృగ్యమైంది. దీంతో బిక్కు బిక్కుమంటూ గడిపిన ప్రజలు మమతా బెనర్జీ రూపంలో ప్రత్యామ్నాయం కనిపించగానే ఆదరించి అందలం ఎక్కించారు. వామపక్షాల నుంచి అధికారం కైవసం చేసుకున్న మమతా బెనర్జీ కూడా కామ్రేడ్ల బాటలోనే నడిచారు. తృణమూల్ కాంగ్రెస్ మూకలు రెచ్చిపోయాయి. ప్రజల హక్కులను హరించారు. అత్యాచారాలు, హత్యాకాండ నిత్యకృత్యమయ్యాయి. ఒక వర్గం ప్రజలను అతిగా సంతృప్తిపరిచేందుకు మరో వర్గం ప్రజలను నిర్లక్ష్యం చేశారు. అత్యాచారానికి గురైన ఒక మహిళ తనకు న్యాయం జరిగే వరకు, అంటే మమతా బెనర్జీ అధికారం కోల్పోయే వరకు కాళ్లకు చెప్పులు ధరించనని శపథం చేశారు. అత్యాచారానికి గురవడంతోపాటు హత్యకు గురైన ఒక వైద్య విద్యార్థిని తల్లి ఆవేదన కూడా ఇదే విధంగా ఉండింది. ఈ ఇద్దరు మహిళలకు తాజా ఎన్నికల్లో బీజేపీ టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలుగా గెలిపించుకుంది. పశ్చిమ బెంగాల్ ప్రజల వెతలను గుర్తించిన బీజేపీ అగ్ర నాయకత్వం ఆ రాష్ట్రంపై దృష్టిని కేంద్రీకరించింది. తక్షణ ఫలితాలు ఆశించకుండా పదిహేనేళ్ల పాటు నిరీక్షించి మరీ ఆ రాష్ట్రాన్ని జయించింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వారిని మమతా బెనర్జీ నెత్తిన పెట్టుకుంటున్నారని ప్రచారం చేస్తూ స్థానిక ముస్లింలలో కూడా చీలిక తీసుకురావడంలో బీజేపీ విజయం సాధించింది. అసోంలో కూడా ఆ పార్టీ ఇదే ఫార్ములాతో స్థానిక ముస్లింలలో కొందరిని తన వైపునకు తిప్పుకొంది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా మాత్రమే ఎన్నికల్లో అత్యధిక విజయాలు ఎందుకు నమోదు చేయగలుగుతున్నారు? పన్నెండేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ ఎందుకు పుంజుకోలేకపోతున్నది? అన్న ప్రశ్నలకు సమాధానం లేకపోలేదు. 'పార్టీ కోసం నేనేం చేయాలి?' అని బీజేపీ నాయకులు ఆలోచిస్తారు. 'పార్టీ నాకోసం ఏం చేసింది?' అని కాంగ్రెస్ నాయకులు ఆలోచిస్తారు. రెండు పార్టీల మధ్య ఇంత మౌలికమైన తేడా ఉన్నప్పుడు ఫలితాలు ఇలాగే ఉంటాయి. ఇక మోదీ -- అమిత్ షాల విషయానికి వద్దాం. వారిరువురికీ రాజకీయం తప్ప మరో ధ్యాస ఉండదు. ప్రధాని మోదీ దినచర్య ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. పగలంతా ఏం చేస్తారో కూడా తెలియదు. అధికారిక కార్యక్రమాలు, సమీక్షలలో పాల్గొన్న దాఖలాలు కనిపించవు. పాలనా వ్యవహారాలను నమ్మకస్తులైన అధికారులకు అప్పగించి కేవలం మార్గదర్శనం చేస్తారట! తన సమయంలో అధిక భాగాన్ని రాజకీయ వ్యూహ రచనకే ఆయన కేటాయిస్తారని చెబుతారు. రెండేళ్ల తర్వాత జరిగే ఎన్నికలపై ఆయన ఇప్పటి నుంచే దృష్టి పెడతారు. ప్రతి సందర్భాన్నీ ఆ దృష్టితోనే చూస్తారు. ఆలోచనలు మోదీవి కాగా, వాటిని అమలు చేసే బాధ్యత అమిత్ షా తీసుకుంటారు. అసోం, పశ్చిమ బెంగాల్లో పాగా వేయాలనే లక్ష్యంతో అక్కడ ప్రత్యర్థి పార్టీలలో బలమైన నాయకులను గుర్తించి, వారిని బీజేపీలోకి ఆహ్వానించి అవసరమైన అండదండలు అందించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన హిమంత బిశ్వశర్మను పార్టీలోకి తీసుకొని ముఖ్యమంత్రిని చేశారు. కాంగ్రెస్ పార్టీకి బలమైన నాయకత్వం లేకుండా చేశారు.పశ్చిమ బెంగాల్లో కూడా మమతా బెనర్జీ వ్యవహార శైలి పట్ల అసంతృప్తితో ఉన్న సువేందు అధికారికి గేలం వేశారు. ఆయనను పార్టీలోకి తీసుకొని మమతా బెనర్జీపై యుద్ధం ప్రకటించారు.

# ఉడుములపాడు గ్రామం లో వృక్షో రక్షిత రక్షితః

# " కార్యక్రమంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే కోట్ల







డోన్ టౌన్, జూలై 07,(సీమ కిరణం న్యూస్): పర్యావరణ పరిరక్షణే భావితరాలకు అందించే గొప్ప కానుక అని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. డోన్ మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "వృక్షో రక్షిత రక్షితః" కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడంలో వృక్షాలు కీలక పాత్ర పోషిస్తాయని, నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు జీవనాధారంగా, అమూల్యమైన సంపదగా నిలుస్తుందని అన్నారు."వృక్షో రక్షిత రక్షితః" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించాలని సూచించారు. పచ్చదనం పెరిగితేనే పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన సమాజం, సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. మొక్కలను కుటుంబ సభ్యుల్లా సంరక్షించి, ప్రతి గ్రామాన్ని హరితవనంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాలు పంపిణీ







డోన్ టౌన్, జూలై 07,(సీమ కిరణం న్యూస్): డోన్ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలోడోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ,వ్యవసాయమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్నారు. రైతుల సాగు ఖర్చులు తగ్గించి, అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.నాణ్యమైన విత్తనాలు రైతులకు సకాలంలో అందించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని, ప్రతి రైతు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి ప్రభుత్వ వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని సూచించారు.డోన్ నియోజకవర్గంలోని రైతుల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్, ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు కార్యకర్తలు ,రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంట నమోదు తప్పనిసరి

## ప్రతి రైతు నమోదు చేసుకోవాలి

## మండల వ్యవసాయ అధికారి అక్బర్ భాష

## వెల్దుర్తి మండలంలో పంట నమోదు పరిశీలన

## కౌలు రైతులతో పాటు అన్ని రకాల భూముల

## సాగుదారులు నమోదు చేసుకోవాలని సూచన





వెల్దుర్తి, జూలై 07, (సీమకిరణం న్యూస్): వెల్దుర్తి మండలంలోని బుక్కాపురం, కలుగొట్ల, పుల్లగుమ్మి, రామళ్లకోట గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు (క్రాప్ రిజిస్ట్రేషన్) కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ భాష పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, గ్రామ విఆర్‌ఓలతో సమావేశమై ఖరీఫ్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదును తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని ప్రతి గ్రామ రైతు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈనాం, దేవదాయ, వక్ఫ్, డి-పట్టా, రిజిస్టర్ పేపర్ల ఆధారంగా సాగు చేస్తున్న భూములతో పాటు కౌలు రైతులు సాగు చేస్తున్న భూములను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.పంట నమోదు చేసుకున్న రైతులు పంట నష్టపరిహారం, పంట బీమా, వ్యవసాయ రుణాలు వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అర్హులు అవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ సంధ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది రఫియా, శ్రావణ్, తనూజ, అరుణ్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.




# డిజిటైజేషన్ ప్రక్రియను నాణ్యతతో

# వేగవంతంగా పూర్తి చేయండి

## రెండవ శనివారం, ఆదివారం రోజులను స్పెషల్ క్యాంపెయిన్ రోజులుగా నిర్వహించండి

## ఎస్ఐఆర్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలి

## ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి పట్టణ ప్రజలకు మరింత ఎక్కువ స్థాయిలో అవగాహన కల్పించే విధంగా ప్రచారం చేయండి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

కర్నూలు ప్రతినిధి, జూలై 07, (సీమకిరణం న్యూస్) : డిజిటైజేషన్ ప్రక్రియను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సర్ అంశం పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రెండవ శనివారం, ఆదివారం రోజులను స్పెషల్ క్యాంపెయిన్ రోజులుగా నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ లను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి పట్టణ ప్రజలకు మరింత ఎక్కువ స్థాయిలో అవగాహన కల్పించే విధంగా ప్రచారం చేయించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఓ ల పురోగతి తక్కువగా ఉన్నట్లయితే సంబంధిత బిఎల్ఓ ల మీద ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి జిల్లాలో జరుగుతున్న సర్ పురోగతి పై వివరిస్తూ జిల్లాలో ఓటరు జాబితా డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం డిజిటైజేషన్ 59.84 శాతానికి చేరిందన్నారు. ప్రతిరోజూ 1.10 లక్షల ఫారాల డిజిటైజేషన్ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, సగటున 1.20 లక్షల ఫారాల డిజిటైజేషన్ పూర్తి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇదే విధంగా కొనసాగించి జూలై 14 నాటికి 85 నుంచి 90 శాతం వరకు డిజిటైజేషన్ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ల నమోదు ఫారాలను నింపడం, పంపిణీ చేయడం లేదా ఓటర్లకు సహాయం చేయడం వంటి సేవల కోసం సచివాలయాలను సహాయ కేంద్రాలుగా (ఫెసిలిటేషన్ సెంటర్లుగా) మార్చడం జరిగిందని, ఈ అంశం పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రెస్ నోట్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. డిజిటైజేషన్ పనులను వేగవంతం చేసేందుకు బీఎల్ఓలకు వీఓఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఫ్ఏలు, టీఏలు తదితర సిబ్బందిని కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, బి.ఎల్.ఓ.లతో చురుగ్గా సమన్వయం చేసుకోవాలని వారిని కోరడం జరిగిందన్నారు.. గత శని, ఆదివారాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించామని, ఈసారి కూడా అదే తరహాలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కర్నూలు నియోజకవర్గంలో డిజిటైజేషన్ శాతం తక్కువగా ఉన్నందున మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అపార్ట్‌మెంట్ సముదాయాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణ



ప్రాంతాలన్నింటిలో మైక్ ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం కర్నూలు నియోజకవర్గంలో 50 శాతం, పాణ్యంలో 54.66 శాతం, ఆదోనిలో 52.95 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని, ఈ మూడు నియోజకవర్గాల్లో పనులను మరింత వేగవంతం చేసి లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.. బుక్ ఏ కాల్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.. 40 శాతం కంటే తక్కువ డిజిటైజేషన్ ఉన్న 52 పోలింగ్ కేంద్రాలను కూడా క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డి ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన విజయవాడ వ్యాపారవేత్త గుడిపాటి సీతారాం



విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీతారాం భార్య, యువ గాయని శ్రీలలిత కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుడిపాటి సీతారాం మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ 'దేశమే ప్రథమం' అనే దృక్పథంతో పనిచేస్తున్నారని, ఆయన నాయకత్వ స్ఫూర్తితోనే తాను జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు, పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.గుడిపాటి ఫౌండేషన్ ఛైర్మన్‌గా సీతారాం క్రీడలు, యువజన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడా రంగంలో తనదైన గుర్తింపు పొందారు. ఆయన చేరికతో కృష్ణా జిల్లాలో జనసేన పార్టీకి క్రీడా, వ్యాపార వర్గాల నుంచి మరింత మద్దతు లభిస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# ఐఐటీ ముంబై, కళాశాలల విద్య ఒప్పందం పొడిగింపు




రాష్ట్ర కళాశాలల విద్య, ఐఐటీ ముంబై స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు మధ్య ఉన్న అవగాహన ఒప్పందాన్ని మరో ఏడాది పొడిగించారు. గత మూడేండ్ల నుంచి కొనసాగిన ఒప్పందం ఈ ఏడాదితో ముగిసింది. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర సచివాలయంలోని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ ఆకాంక్ష సాయిని, ఐఐటీ ముంబై ట్యుటోరియల్ ప్రాజెక్టు నేషనల్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో ఈ ఒప్పందం కుదిరింది.గత మూడేండ్ల నుంచి కొనసాగిన ఒప్పందం ప్రకారం డిగ్రీ కాలేజీలలో విద్యార్థులకు ఐటీ నైపుణ్యాలు, కంప్యూటర్ సంబంధిత సాంకేతిక అం శాలలో యానిమేషన్‌లో శిక్షణ ఇప్పించారు. 50 ప్రభుత్వ కళాశాలలో 50 వేల మందికిపైగా విద్యార్థులను శిక్షణ పూర్తిచేసుకోగా, వీరికి సర్టిఫికెట్లు కూడా ప్రదానం చేశారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమం లో ఐఐటీ ముంబై స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు నేషనల్ కోఆర్డినేటర్ జీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఈపీఎఫ్ఓ సబ్ స్క్రైబర్లకు భారీ రిలీఫ్.. ఇక క్లయిమ్ ఫైలింగ్ ఈజీ..!




ఈపీఎఫ్ఓలో సబ్‌స్క్రైబర్లకు భారీ రిలీఫ్ లభించనున్నది. ఈపీఎఫ్ఓ సబ్‌స్క్రైబర్లు అనారోగ్యం, పిల్లల ఉన్నత విద్య అవసరాలు, ఇతర ఎమర్జెన్సీ అవసరాల కోసం తమ ఈపీఎఫ్ ఖాతాల నుంచి నగదు విత్ డ్రా కోసం క్లయిమ్‌లు దాఖలు చేస్తుంటారు. అలా క్లయిమ్ దరఖాస్తు చేస్తున్నప్పుడు చెక్ లీఫ్, అటెస్టెడ్ బ్యాంక్ పాస్ బుక్ ఫోటోలు అప్ లోడ్ చేయాల్సి వచ్చేది. ఇక నుంచి అలా బ్యాంక్ చెక్ లీఫ్, అటెస్టెడ్ బ్యాంక్ పాస్ బుక్ ఫోటోలు అప్ లోడ్ నిబంధనను సడలించినట్లు ఈపీఎఫ్ఓ తెలిపింది.అలా ఆన్‌లైన్‌లో తమ ఖాతాదారులు దాఖలు చేసే క్లయిమ్స్ పరిష్కారం వేగవంతం చేయడానికి ఈ సడలింపు ఉపకరిస్తుంది. తన సబ్ స్క్రైబర్ల సొంత ఖాతా గల బ్యాంక్, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్పీసీఐ) ద్వారా వారి కేవైసీ వివరాలను ఈపీఎఫ్ఓ నేరుగా చెక్ చేస్తుంది. డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ (డీఎస్‌సీ) వినియోగం ద్వారా ఈపీఎఫ్ఓ సబ్ స్క్రైబర్ల బ్యాంకు ఖాతాలను వారు పని చేస్తున్న సంస్థలు ధృవీకరిస్తాయి. అలాగే సబ్ స్క్రైబర్లు సమర్పించే ఈధార్ నంబర్‌ను భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) ధృవీకరిస్తుంది.

# ఇప్పటివరకు చూడని బర్డ్ ఫ్లూతో వ్యక్తి మృతి

## డబ్ల్యూహెచ్ఓ




అనే బర్డ్ ఫ్లూ వల్ల మెక్సికోలో ఒక వ్యక్తి మరణించాడని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. ఇప్పటి వరకు మానవునిలో ఈ లక్షణాలు చూడలేదని పేర్కొంది.మెక్సికోలోని పౌల్ట్రీలో ఉన్నట్లు గుర్తించామని, అయితే అది మనిషికి ఎలా సోకిందో స్పష్టంగా తెలియదని పేర్కొంది. బర్డ్ ఫ్లూలో అనేక రకాలు ఉన్నాయి. యుఎస్ లోని పాడి ఆవు మందలకు సోకిన ముగ్గురు వ్యవసాయ కార్మికులకు సోకడంతో వారిలో స్వల్ప లక్షణాలు గుర్తించాము. అనేది అలాంటిది కాదని పేర్కొంది. మెక్సికో నగరంలో ఆసుపత్రిలో చేరిన 59 ఏళ్ల వ్యక్తి జ్వరం, శ్వాస ఆడకపోవడం, విరేచనాలు, వికారం వంటి వాటితో బాధపడుతూ ఏప్రిల్ 24న మరణించాడని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. మెక్సికో ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ మరణంపై స్పందిస్తూ వ్యక్తి నుండి వ్యక్తికి బర్డ్ ఫ్లూ వ్యాపించినట్లు ఎటువంటి ఆధారాలు లేవని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మెక్సికోలోని మరణించిన వ్యక్తితో పరిచయం ఉన్న వ్యక్తులను పరీక్షించినప్పటికీ ఇప్పటివరకు మానవ కేసులు కనుగొనబడలేదని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.


# అంతరిక్షంలో వెయ్యి రోజులు.. రష్యా వ్యోమగామి ఒలెగ్ రికార్డు



అంతరిక్షంలో వెయ్యి రోజుల పాటు గడిపి ఓ రష్యా వ్యోమగామి రికార్డు సృష్టించారు. ఒలెగ్ కొనొనెన్కో(59) 2008 నుంచి ఐదుసార్లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణించారు. మంగళవారం నాటికి ఆయన వెయ్యి రోజుల పాటు అంతరిక్షంలోనే నివసించారు. దీంతో ప్రపంచంలోనే ఎక్కువ రోజులు అంతరిక్షంలో ఉన్న వ్యోమగామిగా ఒలెగ్ రికార్డు సృష్టించారని రష్యా అంతరిక్ష సంస్థ రోస్కాస్మోస్ బుధవారం ప్రకటించింది.2024 సెప్టెంబర్ 23 వరకు ఆయన అంతరిక్షంలోనే ఉండనున్నారు. అప్పటికి 1,110 రోజులు అంతరిక్షంలో ఉన్నట్టు అవుతుంది. కాగా, ఒలెగ్ తర్వాత 878 రోజుల 11 గంటల 29 నిమిషాల 48 సెకన్ల పాటు అంతరిక్షంలో ఉన్న రికార్డును రష్యాకే చెందిన గెన్నడీ పడల్కా 2015లో సృష్టించారు.

# కొరియన్ ద్వీపకల్పంపై బి-1బి బాంబర్ చక్కర్లు

## ఏడేళ్ల తర్వాత రంగంలోకి దించిన అమెరికా



సియోల్: ఆయుధ పరీక్షలతో దూకుడు ప్రదర్శిస్తున్న ఉత్తర కొరియాకు హెచ్చరికగా అమెరికా తన బి-1బి బాంబర్‌ను రంగంలోకి దించింది.బుధవారం కొరియన్ ద్వీపకల్పంపై ఇది గగనవిహారం చేసింది. దక్షిణ కొరియాతో కలిసి బాంబింగ్ విన్యాసాలను నిర్వహించింది. ఏడేళ్లలో ఈ బాంబర్ ఈ ప్రాంతంలో గగనవిహారం చేయడం ఇదే మొదటిసారి. ఈ విన్యాసాల్లో అమెరికా, దక్షిణ కొరియాలకు చెందిన అనేక యుద్ధ విమానాలు పాల్గొన్నాయి.వీటిలో బి-1బి బాంబర్.. జాయింట్ డైరెక్ట్ అటాక్ మ్యునిషన్ (జ్యేడామ్) అనే బాంబులను జారవిడిచింది. చివరిసారిగా ఈ బాంబరు 2017లో కొరియా ద్వీపకల్పంపై గగనవిహారం చేసింది. జేడ్యామ్ అనేది ఒక మార్గనిర్దేశక వ్యవస్థ. ఇది సంప్రదాయ అన్‌గైడెడ్ బాంబులను మరింత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగల జీపీఎస్ గైడెడ్ ఆయుధాలుగా మారుస్తుంది. అమెరికాకు చెందిన యుద్ధ విమానాలు, బాంబర్లు, డ్రోన్లు ఈ జేడ్యామ్‌లను ప్రయోగించగలవు. రష్యా దాడులను ఎదుర్కోవడానికి వీటిని ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తోంది.

# ఎట్టకేలకు నింగిలోకి బోయింగ్ వ్యోమనౌక




మూడోసారి రోదసిలోకి పయనమైన సునీతా విలియమ్స్‌సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌కేప్ కెనావెరాల్: ఏళ్ల తరబడి జాప్యం తర్వాత బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌక బుధవారం నింగిలోకి పయనమైంది.ఇందులో భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు బయల్దేరారు. వీరు గురువారం ఈ కేంద్రాన్ని చేరుకుంటారు. అక్కడే వారం బస చేస్తారు. తిరిగి స్టార్‌లైనర్‌లో భూమికి తిరిగొస్తారు.ఈ వ్యోమనౌకకు ఇది తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర. దీన్ని గత నెల మొదటి వారంలో రోదసిలోకి ప్రయోగించేందుకు తొలిసారిగా సన్నాహాలు జరిగాయి. అయితే రాకెట్‌లో సమస్యలు రావడంతో చివరి నిమిషంలో ప్రయోగాన్ని నిలిపివేయాల్సి వచ్చింది. గతవారం మరోసారి స్టార్‌లైనర్ ప్రయోగానికి ప్రయత్నించగా..సాంకేతిక ఇబ్బందులతో ఆపేయాల్సి వచ్చింది. మూడో ప్రయత్నంలో బుధవారం ఈ వ్యోమనౌక నింగిలోకి బయల్దేరింది. ఈ యాత్ర విజయవంతమైతే.. ఐఎస్ఎస్‌కు వ్యోమగాములను పంపడానికి మరో వ్యోమనౌక అమెరికాకు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ సంస్థ సేవలే ఆధారమవుతున్నాయి. సునీతా విలియమ్స్‌కు ఇది మూడో అంతరిక్ష యాత్ర.

# ఇంటి రుణం చెల్లింపు పూర్తయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..!




ప్రతి ఒక్కరూ సొంతింటి కల సాకారం చేసుకోవాలని భావిస్తారు. గతంతో పోలిస్తే సొంతింటి కల నిజం చేయడానికి బ్యాంకులు సహకరిస్తున్నాయి. సంబంధిత వ్యక్తి, కుటుంబ సభ్యుల ఆదాయం, సిబిల్ స్కోర్ ఆధారంగా ఇండ్ల రుణాలు మంజూరు చేస్తున్నాయి. అలా మంజూరైన ఇండ్ల రుణాలు త్వరితగతిన చెల్లించడానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. 10 నుంచి 20 ఏండ్ల పాటు ఇంటి రుణం చెల్లింపు పూర్తయిన తర్వాత ప్రతి ఒక్కరూ ఆనందడోలికల్లో మునిగి తేలుతారు. ఈ ఆనందంలో కొన్ని తప్పులు, పొరపాట్లు చేస్తుంటారు. రుణం ఇచ్చిన బ్యాంకుల నుంచి కీలక డాక్యుమెంట్లు తీసుకోవడం మరిచిపోతుంటారు. దీనివల్ల భవిష్యత్‌లో సమస్యలు ఎదురు కావచ్చు. కనుక రుణ గ్రహీతలు తమ రుణం పూర్తిగా చెల్లించినట్లైతే.. సదరు బ్యాంకు నుంచి తీసుకోవాల్సిన ముఖ్యమైన పత్రాల గురించి తెలుసుకుందామా..!ఇంటి రుణం మంజూరు చేస్తున్నప్పుడు సంబంధిత ఆస్తి పత్రాలను బ్యాంకు తీసుకుంటుంది. అంటే సంబంధిత రుణ గ్రహీత ఇల్లు తాకట్టులో ఉన్నదని అర్థం. అలా తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించే వరకూ సదరు ఆస్తి పత్రాలు బ్యాంకు వద్దే ఉంటాయి. కనుక లోన్ పూర్తిగా చెల్లించగానే, బ్యాంకు సదరు రుణ గ్రహీతకు అసలు పత్రాలు ఇచ్చేస్తుంది. కనుక లోన్ చెల్లింపులు పూర్తయిన తర్వాత ఇంటి అసలు పత్రాలు తీసుకోవడం మరిచిపోవద్దని ఆర్థిక వేత్తలు చెబుతున్నారు.ఇంటి రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత అసలు ఇంటి పత్రాలతోపాటు సంబంధిత బ్యాంకు నుంచి 'నో డ్యూ సర్టిఫికెట్' తీసుకోవాల్సి ఉంటుంది. అలా 'నో డ్యూ సర్టిఫికెట్' ఇవ్వడం వల్ల సదరు వ్యక్తికి ఆ ఇంటిపై యాజమాన్య హక్కులు కల్పించినట్లవుతుంది.ఇంటి కొనుగోలుకు రుణం ఇచ్చిన బ్యాంకుకు సదరు ఆస్తిపై హక్కు ఉంటది. కనుక అత్యవసర పరిస్థితులు ఏర్పడినా రుణం పూర్తిగా చెల్లించే వరకూ బ్యాంకు అనుమతి లేకుండా ఆ ఇంటిని అమ్మలేరు. రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత బ్యాంకు నుంచి 'నో అబ్జక్షన్ సర్టిఫికెట్' పొందితే ఇంటిపై బ్యాంకు తాత్కాలిక హక్కు కల్పిస్తుంది. ఆ తర్వాతే మీరు అవసరమైతే మీ ఇంటిని అమ్ముకోవచ్చు.ఇక ఇంటి రుణం తీసుకోవడంలో సిబిల్ స్కోర్ కీలకం. రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత మీ క్రెడిట్ స్కోర్ అప్ డేట్ అయ్యిందా? లేదా? అన్న సంగతి చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే మున్ముందు మీరు రుణం పొందడం కష్ట సాధ్యమవుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

# గూగుల్ పేతో క్యాష్ బ్యాక్ ఆఫర్లు.. ఇవీ డిటైల్స్..!




ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండాల్సిందే. రోజురోజుకు పెరిగిపోతున్న టెక్నాలజీతోపాటు పలు రకాల సర్వీసులు, పనుల కోసం స్మార్ట్ ఫోన్ ఉపకరిస్తున్నది. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు పంపుకోవడానికి మాత్రమే పరిమితం కాకుండా యూపీఐ ఆధారిత మొబైల్ యాప్స్ సాయంతో ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. స్మార్ట్ ఫోన్లలో గూగుల్ పే యాప్ కూడా ఉంది. దీంతో యూపీఐ లావాదేవీలు, గ్రాసరీ నుంచి అన్ని రకాల వస్తువుల కొనుగోళ్ల షాపింగ్, యుటిలిటీ బిల్లులు, గ్యాస్ సిలిండర్, నీటి బిల్లుల చెల్లింపులు, ఫోన్ రీచార్జీ తేలిగ్గా చేసేయొచ్చు. గూగుల్ పే సాయంతో యుటిలిటీ బిల్లుల చెల్లింపుతో క్యాష్ బ్యాక్ ఆఫర్లు కూడా లభిస్తాయి. గూగుల్ పేతో మనీ కూడా సంపాదించొచ్చు. ఇందుకోసం గూగుల్ ఎర్న్ మనీ ట్రిక్ ఉపకరిస్తుంది. ఈ ట్రిక్ ఎలా ఉపకరిస్తుందన్న సంగతి తెలుసుకుందామాస్మార్ట్ ఫోన్ల యూజర్లు 'గూగుల్ పే' రిఫరల్ కోడ్ వినియోగిస్తూ డబ్బు సంపాదించుకోవచ్చు. ముందుగా గూగుల్‌పే యాప్ యూజర్లు తమ గూగుల్ పే యాప్ లింక్‌ను మిత్రులు, పరిచయస్తులకు షేర్ చేస్తే.. యాప్ అందించే ఆఫర్ ప్రకారం రూ.101 నుంచి రూ.201 వరకూ క్యాష్ బ్యాక్ వస్తుంది. ఇతరులు మీ లింక్ ద్వారా గూగుల్ పే యాప్ డౌన్ లోడ్ చేసుకుని లావాదేవీలు జరిపితేనే ఈ ఆఫర్ పని చేస్తుంది. మీరు పంపిన గూగుల్ పే యాప్‌ను మీ మిత్రులు, పరిచయస్తులు వాడకపోయినా ముందు మీ ఖాతాకు రూ.200 పంపించమనండి.. తరిగి మీరు ఆ వ్యక్తికి రూ.200 పంపేయొచ్చు. అలా చేసినా మీకు రూ.101 %-% 201 క్యాష్ బ్యాక్ లభిస్తుంది. ఇలా రోజూ ఐదుగురికి గూగుల్ పే యాప్ లింక్ పంపితే రూ.500 నుంచి రూ.1000 వరకూ ఆదాయం పొందొచ్చు.గూగుల్ పే యాప్‌లో ఖాతా ప్రారంభించాలంటే మీరు తప్పనిసరిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి. మీ స్మార్ట్ ఫోన్ మొబైల్ నంబర్ ను బ్యాంక్ ఖాతాకు అనుసంధానించాలి. ఏటీఎం లేదా డెబిట్ కార్డు కూడా ఉండాలి. ముందుగా గూగుల్ ప్లే స్టోర్ లోకి వెళ్లి గూగుల్ పే అని టైప్ చేసి ఎంటర్ క్లిక్ చేయాలి. అటుపై గూగుల్ పే యాప్ డౌన్ లోడ్ / ఇన్ స్టాల్ లింక్ మీద క్లిక్ చేయాలి. దీంతో స్మార్ట్ ఫోన్ లో గూగుల్ అప్లికేషన్ డౌన్ లోడ్ అవుతుంది. చివరిగా గూగుల్ పే మొబైల్ యాప్ తెరిచి ఆర్థిక లావాదేవీలు జరుపుకోవచ్చు.

# క్రమశిక్షణ పేరుతో నాలుగేళ్ల బాలుడి నోట్లో పచ్చి మిర్చీ కుక్కిన తండ్రిబీ ఆ చిన్నారి మృతి



రెండేళ్ల క్రితం, క్రమశిక్షణ పేరుతో తన నాలుగేళ్ల కుమారుడి నోట్లో పచ్చి మిర్చీ కుక్కి, ఆ బాలుడి మరణానికి కారణమైన సింగపూర్ వ్యక్తికి ఎనిమిది నెలల జైలు శిక్ష పడింది.ఈ ఘటన 2022 ఆగస్ట్ లో సింగపూర్ లో చోటు చేసుకుంది.బయట టాయిలెట్ కు వెళ్లాడని..చిన్న పిల్లలకు సాధారణంగా టాయిలెట్ ఉపయోగించడంపై చిన్న వయస్సు నుంచే శిక్షణ ఇస్తుంటారు. అలా తన కుమారుడికి కూడా ఆ 38 ఏళ్ల తండ్రి టాయిలెట్ ట్రైనింగ్ ఇస్తున్నాడు. 2022 ఆగస్టులో కుమారుడితో కలిసి ఆ తండ్రి సింగపూర్లోని తన ఇంట్లో ఉండగా ఈ ఘటన జరిగింది. ఆ 4 ఏళ్ల బాలుడు టాయిలెట్ ఉపయోగించకుండా, బయటే మలవిసర్జన చేశాడు. దాంతో, ఆ తండ్రికి పట్టరాని కోపం వచ్చింది. తప్పు చేసిన కొడుకును శిక్షించాలనుకున్నాడు. ఆ బాలుడు ఏడుస్తున్నా, పట్టించుకోకుండా, పచ్చి మిర్చీని బలవంతంగా ఆ బాలుడి నోట్లో కుక్కాడు. ఏడుస్తూ, ఆ బాలుడు గది అంతా పరుగులు పెట్టాడు. తన గొంతు వైపు చూపుతూ సైగలు చేస్తూ కాసేపటికి కుప్పకూలి స్పృహ కోల్పోయాడు.హుటాహుటిన ఆసుపత్రికి..తల్లి ఎంత ప్రయత్నించినా బాలుడి పరిస్థితి మెరుగుపడకపోవడంతోఅంబులెన్స్‌కోసం కాల్ చేసింది. చివరకు తండ్రి ఆ బాలుడిని ఎత్తుకుని సమీపంలోని ఫ్యామిలీ క్లినిక్ కు తీసుకెళ్లాడు. అప్పటికే చిన్నారి పల్స్, శ్వాసను కోల్పోయినట్లు సమాచారం. అనంతరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శవపరీక్షలో మిర్చి ముక్క బాలుడి శ్వాసనాళంలో ఇరుక్కుపోయినట్లు తేలింది. ఆ బాలుడి తల్లిదండ్రులకు మరో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నేరంపై ఆ బాలుడి తండ్రికి స్థానిక కోర్టు 8 నెలల జైలు శిక్ష విధించింది. "మీ పిల్లలను క్రమశిక్షణలో పెట్టడానికి మీరు ఇలాంటి పద్ధతిని అవలంబించడం సరికాదు" అని శిక్ష ప్రకటిస్తూ న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా.. మీ కాలేయానికి ప్రమాదం పొంచి ఉన్నట్లే !




కాలేయం.. శరీరంలో అతి కీలకమైన అవయవం. ఇది అతిపెద్ద గ్రంథి. ఒక్క కాలేయమే దాదాపు అయిదొందల విధులు నిర్వర్తిస్తుంది. చర్మం తరువాత ఒక్క కాలేయానికే పునరుత్పత్తి సామర్థ్యంఉంది. దాదాపు డెబ్బయి అయిదు శాతం దెబ్బతిన్నా కూడా.. తక్కిన పావు భాగంతోనే కాలేయం తన విధులను నిర్వహించగలదు. అంతేకాదు, ఆరోగ్యకరమైన జీవనశైలితో శిథిలమైన భాగాన్ని తిరిగి అభివృద్ధి చేసుకోగల అసాధారణ శక్తి కాలేయానికి ఉంది. మనిషి మరణించే వరకూ ఆ పునరుత్పాదక శక్తి కొనసాగుతుంది. అంటే కాలేయం తనకు నష్టం కలిగిస్తున్న అలవాట్లు, వ్యాధులను గుర్తించి.. ఆ లోపాల్ని సరిదిద్దుకోవడానికి మనిషికి అవకాశం ఇస్తుందన్నమాట. అయితే కాలేయ కణాలు మొత్తం దెబ్బతిన్నప్పుడు మాత్రం పరిస్థితి పూర్తిగా చేజారుతుంది. కాలేయానికి ఉన్న ప్రత్యేక శక్తి కూడా పనికి రాకుండా పోతుంది.మద్యపాన వ్యసనం, హెపటైటిస్-బి, సి వైరస్ ఇన్ఫెక్షన్ల వల్ల ఎక్కువమందికి కాలేయ వ్యాధులు దాపురిస్తున్నాయి. ఆ రుగ్మతకు సంకేతంగా మొదట కామెర్ల వ్యాధి సోకుతుంది. దాన్ని

**తొలిదశలోనే**

గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోవాలి. లేదంటే, అది కాస్త ముదిరి కాలేయం పనితీరు తీవ్రంగా దెబ్బతింటుంది. వీటిలో హెపటైటిస్- ఎ, ఇ వైరస్‌ల వల్ల వచ్చే కామెర్లు మరీ ప్రమాదకరం. హఠాత్తుగా మరణం ముంచుకొస్తుంది. కలుషితమైన నీళ్లు, ఆహారం నుంచి హెపటైటిస్-ఎ, ఇ వైరస్‌లు శరీరంలో ప్రవేశిస్తాయి. దీర్ఘకాలంపాటు మితిమీరిన మద్యపానం అలవాటు.. కాలేయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. దీంతో, లివర్ సిరోసిస్ వ్యాధి వస్తుంది.ఊబకాయం కూడా కాలేయ వ్యాధులకు కారణం అవుతున్నది. ఫ్యాట్ సిరోసిస్ లేదా నాన్ ఆల్కహాలిక్ స్టియటోహెపటైటిస్ ఏర్పడుతుంది. ప్రస్తుతం కాలేయ సమస్యలతో వస్తున్న వారిలో దాదాపు సగం మందిలో ఈ ఫ్యాట్ సిరోసిస్ వ్యాధే కనిపిస్తున్నది. ఫ్యాట్ సిరోసిస్ బి, సి దశ ప్రారంభంలో కాలేయ కణాలు చాలావరకు పనిచేయలేని స్థితికి చేరుకుంటాయి. ఇక పిల్లల్లో కనిపించే కాలేయ వ్యాధులు చాలావరకు పుట్టుకతో వస్తున్నవే. శరీరధర్మాలకు సంబంధించినవే. విల్సన్ డిసీజ్, బైల్ డక్ట్స్ లేకపోవటం, కురుపులు వంటి సమస్యలు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సమస్యలు ఉన్న పిల్లల కాలేయం భవిష్యత్తులో పూర్తిగా పనిచేయలేని స్థితికి చేరుకుంటుంది.కాలేయం దెబ్బతినటం ఓ ప్రమాద సంకేతం. ముందుగానే గుర్తించగలిగితే క్యాన్సర్ సహా వివిధ కాలేయ వ్యాధులను ఔషధాలతో నయం చేయవచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం పరిస్థితి చేజారిపోతుంది. కాలేయ వ్యాధులు సోకినా కూడా.. ఆ లక్షణాలు బయటపడటానికి పది నుంచి ఇరవై సంవత్సరాల సమయం పడుతుంది. ఈ సుదీర్ఘ కాలంలో కాలేయ కణాలు క్రమంగా మృతిచెందుతూ వస్తాయి. దీంతో 'లివర్ స్కార్' ఏర్పడుతుంటుంది. ఇది కాలేయాన్ని పూర్తిగా కప్పేసేటప్పటికి రోగలక్షణాలు స్పష్టంగా బయటపడతాయి. అప్పటికే వ్యాధి ముదిరిపోయి ఉంటుంది. ఈ పరిస్థితికి చేరేలోగా కాలేయానికి కష్టాలు మొదలైపోతాయి. ఆ సంకేతాలూ కనిపిస్తాయి. కళ్లు పచ్చబడతాయి. దురద బాధపెడుతుంది. ఆకలి మందగిస్తుంది. నీరసంగా ఉంటుంది. ఎప్పుడూ నిద్రమత్తే. కడుపులో వికారంగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరదు. జ్ఞాపకశక్తి మందగిస్తుంది. చివరికి కోమాలోకి జారిపోతారు.కాలేయ క్యాన్సర్ అంటే ఇదివరకు డాక్టర్లలో కూడా దాదాపు 90 శాతం మందికి మరణమే అనే భావన ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. అత్యాధునిక సర్జరీతో క్యాన్సర్ కణుతులను పూర్తిగా తొలగించటం సాధ్యమవుతున్నది. కణితి 3- 5 సెంటీమీటర్లు ఉంటే ఆర్ఎఫ్ఏ, టీఏసీఈ వంటి సర్జరీయేతర చికిత్స చేస్తారు. వీరిలో 90 శాతం మంది కోలుకుంటారు. అయితే వీరికి రెండు మూడేండ్లలో మళ్లీ కాన్సర్ వచ్చే ముప్పు ఉంటుంది. అందువల్ల క్రమం తప్పకుండా డాక్టర్‌కు చూపించుకుంటూ ఉండాలి. అవసరమైతే ఆ చికిత్సలను కొనసాగించి క్యాన్సర్ కణుతులను అదుపుచేస్తారు. 'బి' నుంచి తరువాతి స్థాయికి మారుతున్న స్థితిలో వచ్చినవారికి, 'సి' చైల్డ్ స్థాయి పూర్తిగా ముదరని దశలో వచ్చిన వారికి కాలేయ మార్పిడి చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. ఇలాంటి కేసులలో తొంభై అయిదు శాతం వరకు కాలేయ మార్పిడి సర్జరీలు విజయవంతం అవుతున్నాయి. ఇటీవలి కాలంలో కాలేయ వ్యాధుల చికిత్స ఆధునికతను సంతరించుకుంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శక్తిమంతమైన మందులు, కచ్చితమైన శస్త్రచికిత్సలు, కాలేయ



మార్పిడి సర్జరీలు ఎక్కువ శాతం విజయవంతం అవుతుండటం కాలేయ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగిస్తున్నాయి.వివిధ కారణాలతో కాలేయం పూర్తిగా పనిచేయలేని స్థితికి చేరుకున్నప్పుడు రోగి ప్రాణాలను కాపాడేందుకు కాలేయ మార్పిడి ఒక్కటే మార్గాంతరం. పాడైన కాలేయాన్ని తీసేసి.. ఆ స్థానంలో ఆరోగ్యకరమైన కాలేయాన్ని అమర్చటానికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ చేస్తారు. దీనిలో దాత నుంచి మొత్తం కాలేయాన్ని కానీ లేదా కొంతభాగాన్ని కానీ సేకరించి అమరుస్తారు. చాలా సందర్భాల్లో అవయవదానానికి అంగీకరించిన వ్యక్తి మృతిచెందిన వెంటనే సేకరించిన కాలేయంతోనే మార్పిడి చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో రక్తం గ్రూపు కలిసిన కుటుంబసభ్యులు, బంధువులు తమ కాలేయంలో నాలుగో వంతు భాగాన్ని దానం చేస్తున్నారు. ఈ విధంగా కాలేయంలో కొంతభాగాన్ని తెంచుకున్నప్పటికీ దాతలు మిగిలిన భాగంతో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతారు. కోల్పోయిన భాగం కొద్ది వారాల్లోనే పూర్వపు పరిమాణానికి పెరుగుతుంది. అదే సమయంలో స్వీకర్తలో కూడా కాలేయం పూర్తిస్థాయికి ఎదుగుతుంది.మార్పిడి రెండు రకాలుఅయితేమద్యపానం, డ్రగ్స్‌కు అవాటుపడిన, ఇన్ఫెక్షన్స్, గుండె ఊపిరితిత్తులు-నాడీ సంబంధిత వ్యాధులు ఉన్నవాళ్లు కాలేయ దానానికి అనర్హులు. ఇలాంటి ఆరోగ్య సమస్యలు లేని యాభై ఏండ్ల లోపు రక్త సంబంధీకులు ఎవరైనా కాలేయ దానం చేయవచ్చు. బంధువులు ముందుకు రాకపోయినా, వచ్చినవాళ్లు ఆరోగ్యపరంగా అర్హులు కాకపోయినా.. కాలేయ మార్పిడి అవసరమైన వారు 'జీవన్‌దాన్' పథకం కింద పేరు నమోదు చేయించుకోవాలి. అంటే కాలేయ మార్పిడికి రెండు పద్ధతులు ఉన్నాయన్న మాట. మొదటిది, జీవించి ఉన్న దాత శరీరం నుంచి సేకరించిన దాన్ని అవసరమైన వారికి అమర్చటం. రెండోది బ్రెయిన్‌డెడ్ అయినవారి నుంచి సేకరించడం. కాలేయం అందుబాటులోకి వచ్చిన వెంటనే వ్యాధిగ్రస్తుడిని ఆపరేషన్‌కు సిద్ధంచేస్తారు. బంధువు (లైవ్ డోనార్) నుంచి కాలేయం తీసుకుంటున్న పక్షంలో వేర్వేరు ఆపరేషన్ థియేటర్లలో ఒకేసారి



ఇద్దరికీ సర్జరీ చేస్తారు.అదే బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి సేకరిస్తున్నట్లయితే ఆ కాలేయం రాగానే శస్త్రచికిత్స మొదలుపెడతారు. ఆపరేషన్ పూర్తికావటానికి నాలుగు నుంచి పద్నాలుగు గంటల సమయం పడుతుంది. ఒక డాక్టర్ల బృందం వ్యాధిగ్రస్తుడి శరీరం నుంచి పనిచేయని కాలేయాన్ని తీసివేస్తుంటే మరో బృందం మంచి కాలేయాన్ని మార్పిడికి సిద్ధం చేస్తుంటుంది. ఇవి పూర్తికాగానే ఆరోగ్యవంతమైన కాలేయాన్ని వ్యాధిగ్రస్తుడిలో అమర్చే సర్జరీ జరుగుతుంది. ఆరోగ్యవంతమైన దాన్ని అమర్చి రక్తనాళాలు, బైల్ డక్ట్స్‌ను కలిపిన వెంటనే కొత్త కాలేయంలోకి రక్తప్రవాహం ప్రారంభమవుతుంది.ఇలా అమర్చిన కాలేయాన్ని రిజెక్షన్ (కొత్తగా అమర్చిన అవయవాన్ని శరీరం తిరస్కరించి రోగనిరోధక వ్యవస్థ దానిపైన దాడిచేయటం) నుంచి కాపాడి, కొత్త వ్యక్తి శరీరంతో సర్దుకుపోయేందుకు డాక్టర్లు ఇంజక్షన్లు, ఇతర మందులు ఇస్తారు. రక్తస్రావం, సంక్రమణ వ్యాధుల నుంచి కాపాడతారు. అదే సమయంలో మార్చిన కాలేయాన్ని కాపాడుకుంటూ అది సరిగ్గా పనిచేసేట్లు చూసుకోవటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను మార్పిడి చేయించుకున్న వ్యక్తికి, కుటుంబానికి తెలియజేస్తారు. కాలేయ మార్పిడి చేయించుకున్న వారు పూర్తిగా కొలుకున్న తరువాత కొద్దివారాలు విశ్రాంతి తీసుకుని తమ జీవితాన్ని తిరిగి ప్రారంభించగలుగుతారు.ముందస్తు పరీక్షలుమద్యపాన వ్యసనపరులు, వైరస్ వ్యాధులు సోకినవారు, ఫ్యాటీలివర్ వ్యాధిగ్రస్తులు లివర్ స్కార్ లక్షణాలు పూర్తిగా బయటపడే దాకా వేచి ఉండకుండా.. ముందస్తు పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. రక్తపరీక్ష, ఫైబ్రోస్కాన్ (ట్రాన్సియెంట్ ఎలాస్టోగ్రఫీ) ద్వారా కాలేయ క్యాన్సర్‌ను తొలిదశల్లోనే గుర్తించవచ్చు. ఇక వివిధ వ్యాధుల వల్ల కాలేయానికి జరిగిన నష్టాన్ని బట్టి ఆ తీవ్రతను మూడు దశలుగా గుర్తిస్తారు. వీటిని ఎ, బి, సి.. 'చైల్డ్ పగ్ స్టేజెస్'గా వర్గీకరించారు. 'ఎ' చైల్డ్ దశలోనే డాక్టర్‌ను సంప్రదిస్తే మందులతో, అలవాట్లలో మార్పులతో చికిత్సచేసి పూర్తి సాధారణ పరిస్థితికి తీసుకురావచ్చు. మొదటి రెండు (ఎ, బి చైల్డ్ స్టేజెస్ ) దశల్లో కాలేయం చాలా వరకు తిరిగి కోలుకోవటానికి అవకాశం ఉంటుంది. పరిస్థితి పూర్తిగా విషమించిన దశతో పోలిస్తే మొదటి దశలో చికిత్సకు అయ్యే ఖర్చు పది శాతాన్ని మించదు. దురదృష్టవశాత్తు మనదేశంలో కాలేయ వ్యాధిగ్రస్తులలో అత్యధికులు 'బి' నుంచి 'సి' చైల్డ్ స్టేజికి మారేదశలో, 'సి' చివరి దశలో ఆస్పత్రులకు వస్తున్నారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com